క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

చిత్తూరు రూరల్: ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ అన్నారు. చిత్తూరు మండలం చింతలగుంట, తాళంబేడు సచివాయంలో శుక్రవారం ఆయన లబ్ధిదారులు, సర్పంచులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఇంతవరకు ప్రారంభం కాని పనులపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ మాలతి, సిబ్బంది సతీష్, శరత్, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐరాలకు చేరిన విద్యాకానుక కిట్లు



కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఐరాల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ, ప్రాథమిక పాఠశాలలకు పంపిణీ చేసేందుకు విద్యాకానుక కిట్లు వచ్చినట్లు ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 3,810 మంది విద్యార్థులకు యూనిఫాం వచ్చిందన్నారు. వీటిని రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల వారీగా విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై మాయావతి స్పందించాలి

చిత్తూరు రూరల్: ఎస్సీ వర్గీకరణపై చట్టబద్ధతకు బీఎస్పీ అధినేత మాయవతి సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఎన్నో ఏళ్లుగా పోరాడుతోందన్నారు. జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని చెప్పారు. ఈనెల 7న బీఎస్పీ అధినేత మాయవతి హైదరాబాద్‌కు వస్తున్నారని..ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం సానుకూలమైన ప్రకటన చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రామక్రిష్ణ, ప్రకాష్, రెడ్డెప్ప, గోపాల్, ఉమాపతి, హేమాద్రి, రాజేష్ తదితరులు ఉన్నారు.

తవణంపల్లెలో మోస్తరు వర్షం



తవణంపల్లె: మండలంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వేసవి తాకిడికి ఉక్కపోతతో బాధప డుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. మండలంలో ఈనెల 4వ తేదీన 21,2 మిల్లీ మీటర్లు, 5న 22.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు.

కార్ల్‌మార్క్స్‌కు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: కార్ల్‌మార్క్స్ 205వ జయంతి సందర్భంగా చిత్తూరులో ఆయన చిత్రపటానికి సీపీఐ నాయకులు నివాళులు అర్పించారు. సమాజం కోసం అహర్నిశలు శ్రమించిన మేధావి అని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ స్మరించారు. ఆయన సిద్ధాంతాలను కమ్యూనిస్టు నాయకులు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మణి, జయలక్ష్మి, రఘు, బాలాజీరావు పాల్గొన్నారు.

వర్షం తెచ్చిన ఉపశమనం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం, మండల ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం పూర్తిగా చల్లబడింది. శుక్రవారం కూడా మోస్తరు వాన కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో మొదలైన చిరు జల్లులు భారీ వర్షంగా మారింది. సాయంత్రం 5.30 గంటల వరకు కురిసిన ఈ వర్షంతో చిత్తూరులోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పుత్తూరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని యూనియన్ బ్యాంకు మేనేజర్ కళ్యాణ్ అన్నారు. శుక్రవారం రాష్ట్రీయ సేవా సమితి (రాస్) వ్యవస్థాపకుడు డాక్టర్ గుత్తా మునిరత్నం ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. మునిరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళ్యాణ్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆసుపత్రుల్లో అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న వారికి పాణదానం చేసినట్లేనని అన్నారు. రాస్ పాదువు సంఘాల సభ్యులు, విద్యార్థులు 106 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ కె.రవి, సిబ్బంది అన్నలగన్, మునితేజ, బాబునాయుడు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పల్లె సీమలు



గుండ్లపల్లెలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెసీమలు ప్రగతి పథంలో సాగుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం మం డలంలోని గుండ్లపల్లె సచివాలయ పరిధిలోని గుండ్లపల్లె, దిగువగుండ్లపల్లె దళితవాడ, ఉప్పరపల్లె, దిగువగుండ్లపల్లె, జీఆర్‌రెడ్డి ఎస్టీ కాలనీ, వెంకటాపురం, వెంకటాపురం దళితవాడ, అక్కమ్మచెరువుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 305 ఇళ్లను సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. తొలుత గుండ్లపల్లెలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ కుటుంబానికి, ఏ మేరకు లబ్ధి చేకూరిందో బుక్‌లెట్‌ల ద్వారా వివరించారు. ఎవరికైనా ఆయా పథకాలు సక్రమంగా అందకపోతే అందుకు గల కారణాలను సంబంధిత అధికారులను ప్రశ్నించి, వాస్తవాలను ప్రజలకు వివరించారు. ఆయా గ్రామస్తులు నివేదించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, గుండ్లపల్లె సర్పంచ్ రెడ్డెమ్మ, కాణిపాకం సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ హరీష్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ నేతలు ముదిగోళం ప్రభాకర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ప్రసాద్, ధనంజయ, ప్రభాకర్‌రెడ్డి, ధనచంద్రరెడ్డి, రాజేష్‌రెడ్డి, దేవా, రాము, శేషాద్రి, రవిచంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, రవిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.

నేడు గుండ్లపల్లె సచివాలయ పరిధిలో

శనివారం గుండ్లపల్లె సచివాలయ పరిధిలో ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు నిర్వహిస్తారని ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలన్నారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు



అర్ధగిరి క్షేత్రంలో సుదర్శన హోమం



ఆలయంలో రద్దీ

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం బుద్ధ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. ఆలయ ఆవరణలో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం ఈఓ వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షణలో తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి 8 గంటలకు ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. తొలుత శ్రీవీరాంజనేయస్వామి ఉత్సవ మూర్తికి అభిషేక పూజలు, అలంకరణలు చేసి పల్లకిలో కొలువుదీర్చారు. అర్చకులు, భక్తులు కోలపాటలు పాడుతూ ప్రదక్షిణ చేశారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, చెక్కభజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నాడు–నేడు పనుల్లో వేగమేదీ?

● సమీక్షలో కమిషనర్ అరుణ అసంతృప్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న 'మనబడి నాడు–నేడు' పనులను మరింత వేగవంతం చేయాలని నగర కమిషనర్ జె.అరుణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నాడు–నేడు పనుల పురోగతిపై శుక్రవారం నగర పాలక కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంఈ ధనలక్ష్మి, డీఈలు, ఏఈలు, సంబంధిత వార్డు అమినిటీ కార్యదర్శులతో ఆమె సమీక్షించారు. నగర పరిధిలో 8 పాఠశాలల్లో నాడు–నేడు పనులు అనుకున్నంత వేగంగా చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యంపై పాఠశాలల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయించాలని, పనులకు చేసిన వ్యయాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. సమావేశంలో డీఈలు రమణ, వెంకట ప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

ఘనంగా చిత్రాపౌర్ణమి వేడుకలు



భక్తులకు దర్శనమిస్తున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

గుడిపాల: 197రామాపురంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో శుక్రవారం చిత్రపౌర్ణమి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి కాకడ హారతి సమర్పించారు. ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలకు అభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6గంటలకు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి అష్టోత్తర శతనామవళి పూజా కార్యక్రమం నిర్వహించి కలశపూజ, చంద్రపూజ నిర్వహించారు. ఉత్సవమూర్తులైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారికి అలంకరించి పుష్పపల్లకి సేవలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బ్రహ్మయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వంట గ్యాస్ ధర తగ్గించాలని 8న ధర్నా

చిత్తూరు కార్పొరేషన్: రాజస్థాన్‌లో ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్‌లో కూడా తక్కువ ధరకు వంటగ్యాస్‌ను ఇవ్వాలని మహిళ సమైక్య జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. మోదీ పాలనలో ధరలు పెంచడమే పనిగా మారిందని విమర్శించారు. బడాబాబులకు ప్రభుత్వ ఆస్తులను విక్రయించడం, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే బీజేపీగా పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. వంటగ్యాస్ ధరను తగ్గించాలని ఈనెల 8న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కుమారి, రమాదేవి, రాజేశ్వరి, డీహెచ్‌పీఎస్ నాయకులకు రఘు, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

వరదరాజస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉత్సవమూర్తులకు పూజలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అనుబంధ శ్రీదేవి,భూదేవి సమేత వరదరాజ స్వామి ఆలయంలో చిత్ర పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని, శ్రీదేవి భూదేవి సమేత వరదరాజ స్వామి వారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు శ్రీధర్ బాబు, కోదండపాణి, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాయకులు

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ ఎర్రగుంతల వారిపల్లెకు చెందిన గంగాధర రెడ్డి కుటుంబానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సాయం చేశారు. గంగాధరరెడ్డి కుమారుడు నవీన్ కుమార్‌రెడ్డి ఆరు రోజుల కిందట మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. శుక్రవారం మంత్రి అందజేసిన రూ.లక్షను బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, వైస్ ఎంపీపీ ప్రభాకర, నాగభూషణంరెడ్డి, సాంబయ్య, వరదం రమణ, రమణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

సర్వేలలో కీలకపాత్ర పోషించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్

పెద్దపంజాణి: వివిధ ప్రభుత్వ సర్వేలలో మహిళా సంరక్షణ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ టి.శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో జరుగుతున్న ఎస్‌డీజీ, ఆయుష్మాన్ భారత్ తదితర సర్వేలు పూర్తి కావాలంటే మహిళా సంరక్షణ కార్యదర్శులు కీలక భూమిక పోషించాలన్నారు. జిల్లాలో పెద్దపంజాణి మండలాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణంలో టార్గెట్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. విస్తరణ అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు ముఖ్యం



గుడిపాల: రోగులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రకాశం



బంగారుపాళెం : ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ నాయక్



బంగారుపాళెం: కీరమందలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్

గుడిపాల: మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రకాశం ఆదేశించారు. శుక్రవారం చీలాపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్ ప్రశాంతి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తుండగా ఆయన రోగులతో మాట్లాడారు. సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నారా, కావలసిన మందులు, మాత్రలు ఇస్తున్నారా? లేదా బయట తీసుకోమంటున్నారా? అని ఆరా తీశారు. ప్రతి రోగికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పక్కాగా ఉండాలని సూచించారు. ఇంటికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారా? లేదా? అని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ భానుప్రకాష్, ఏఎన్‌ఎం ఉమామహేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, డిఇఓ ప్రవీణ్, ఆశావర్కర్ సుధ, సుప్రియ పాల్గొన్నారు.

సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

బంగారుపాళెం: ఆసుపత్రులకు వచ్చే రోగులకు సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని జిల్లా వైద్యశాలల సమన్వయ అధికారి(డీసీహెచ్‌ఎస్) డాక్టర్ బీసీకే నాయక్ ఆదేశించారు. స్థానిక సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డు, ఫార్మసీ స్టోర్, ఎక్స్‌రే ల్యాబ్, స్కానింగ్ సెంటర్, కాన్పుల వార్డును, ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న భవనం పనులను పరిశీలించారు. రోగులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని మెడికలాఫీసర్ డాక్టర్ శిరీషకు సూచించారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయకుమారి, రాగభావన, భరత్, హెడ్ నర్స్ మునీరాభాను, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఫ్యామిలీ డాక్టర్ ఉద్దేశమని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ అన్నారు. మండలంలోని కాటప్పగారిపల్లె, కీరమందలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్, ఎంఎల్‌పీహెచ్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

అందుబాటులో వైద్యం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ముంగిట్లో వైద్యం అందుతోందని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మొరంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భూపంపిణీకి దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు రూరల్: భూ పంపిణీ పథకం కింద అనుభవంలో ఉన్న భూమికి పట్టాలేని వారి నుంచి మళ్లీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిరణ్ తెలిపారు. చిత్తూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మళ్లీ భూ పంపిణీ పథకానికి దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. అనుభవంలో భూమి ఉండి...ఇంత వరకు పట్టాలేని వారు అర్హులన్నారు. ఇక ఆ భూమిలో ఏటా పంటలు సాగు చేస్తుండాలని, ఆ అనుభవదారుడికి ఇంతవరకు ఎలాంటి భూమి ఉండరాదని, అర్హులైన వారు వారంలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉపాధి ఏపీఓగా బాల

యాదమరి: ఉపాధి హామీ పథకం ఏపీఓగా బాల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాలసముద్రం నుంచి ఆయన ఇక్కడికి రాగా, ఇక్కడ పని చేస్తున్న కవిత చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఉపాధి హామీ కార్యాలయంకు వెళ్లగా ఆమె స్థానంలో పాల సముద్రంలో విధులు నిర్వహిస్తున్న బాల బదిలీపై యాదమరికి వచ్చారు.

ధర్మదీక్ష స్వీకరణ



బుద్ధ పూజ చేస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్: చిత్తూరులో శుక్రవారం దళిత ప్రజాసంఘాలు, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జేఏసీ కార్యాలయంలో ధర్మదీక్ష స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. పాతబస్టాండులో బుద్ధపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలక్రిష్ణారెడ్డి, పార్థసారథి, విజయ్, రాకేష్, కృష్ణ, హరిబాబు, ధనంజయులు, రాము, రవి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పిస్తాం

పలమనేరు: ఈనెల 13న జరిగే లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పిస్తామని మానవహక్కుల సంఘ సంస్థ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్‌ను జిల్లా కోర్టులోని లీగల్ సర్వీసెస్ అథారిటీతో కలిసి ఈమేరకు తెలిపినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు మాదేష్ తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి లోక్ అదాలత్ ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. సంఘం నాయకులు శివశంకర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అవసరం



విద్యార్థులతో అధ్యాపకులు, తల్లిదండ్రులు

తవణంపల్లె: నర్సింగ్ విద్యార్థులు సేవాభావంతో వైద్య సేవలందించాలని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి మార్గదర్శనం చేశారు.. శుక్రవారం అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్ సెర్మినరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సేవాభావంతో వైద్య సేవలందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అపోలో చీఫ్ ఆపరేటింగ్ ట్రస్టీ సత్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

15లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పుంగనూరు: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఈనెల 15లోపు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండల కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరితో కలసి గృహ నిర్మాణశాఖ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కాలనీలు సుందరంగా ఉండేలా చూడాలని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు ఆయా ప్రాంతాల కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రతి రోజూ పర్యవేక్షించాలని సూచించారు. ఎవరు అలసత్వం వహించకూడదని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఏఈలు హేమంత్‌కుమార్, శేఖర్, ఐకేపీ ఏపీఎం రవికుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

పెద్దపంజాణి: జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ వివరించారు. సీఈఓ మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణాల టార్గెట్ పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

సంఘమిత్రపై పీడీకి ఫిర్యాదు

బైరెడ్డిపల్లె : తమను ధిక్కరించి నగదును డ్రా చేయడంపై మండలంలోని కుప్పనపల్లె సంఘమిత్ర మహాతులసిపై ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు శుక్రవారం ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మహాతులసికి ఎస్‌హెచ్‌జీ గ్రూపు పేరుపై ఖాతా ఉందన్నారు. గ్రూపునకు సంబంధించి రూ.12 లక్షలు రుణం తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గ్రూపులో 10 మంది సభ్యులు ఉండగా, సరస్వతి అనే సభ్యురాలికి 60 సంవత్సరాలు పైబడడంతో రుణం ఇవ్వకూడదని తీర్మానం చేశామన్నారు. ఈ విషయం బ్యాంకు మేనేజర్‌కు తెలియజేశామని, అయితే గ్రూపు సభ్యుల అనుమతి లేకుండా సంఘమిత్ర, బ్యాంకు మేనేజర్ కలిసి సరస్వతికి రుణం మంజూరు చేసి నగదును అందజేశారని తెలిపారు. సరస్వతి నగదు చెల్లించకపోతే గ్రూపు సభ్యులది బాధ్యత కాదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ.20 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె కాలనీలో రూ. 20 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి సర్పంచ్ గోవిందయ్య శుక్రవారం భూమి పూజ చేశారు. 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంకును నిర్మించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పటికే జల జీవన్ మిషన్ కింద కొత్తగా బోరు కూడా వేసినట్లు తెలిపారు. త్వరలో నిర్మాణాన్ని పూర్తి చేసి తాగునీటి సరఫరా చేస్తామన్నారు.